పగలు గుబులు.. రాత్రి వణుకు

- భిన్న వాతావరణ పరిస్థితులు
- అయోమయంలో ప్రజలు


నిర్మానుష్యంగా అంబాజీపేట నాలుగు రోడ్ల సెంటర్

అంబాజీపేట: పగలు ఎండ వేడిమి... రాత్రి సమయాల్లో చలితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గత కొద్ది రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతుండగా... రాత్రి చలిగాలులు తీవ్రత ఎక్కువగా ఉంటోంది. కొద్దిరోజులుగా తెల్లవారుజామున దట్టమైన మంచు కురుస్తోంది. సాధారణంగా శివ రాత్రి వస్తే శివ శివ అంటూ చలిగాలులు వెళ్లిపోతాయని చెబుతుంటారు. అయితే గతంలో ఎప్పుడూ లేని విధంగా మార్చి మొదటి వారం నుంచే ఎండ తీవ్రత అధికమవుతోంది. మరోవైపు గత కొద్ది రోజులుగా రాత్రి సమయాల్లో చలిగాలులు పెరుగుతున్నాయి. గత వారం రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు అధికమవుతున్నాయి. పి.గన్నవరం, కొత్తపేట, రాజోలు మండలాల్లోని పరిసర ప్రాంతాల్లో గరిష్టంగా 35 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అయితే రాత్రి సమయాల్లో మాత్రం ఉష్ణోగ్రతలు అమాంతం పడిపోతున్నాయి. సోమవారం తెల్లవారుజామున 20 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదుకాగా మధ్యాహ్నం 36 డిగ్రీల పైబడి నమోదవుతోంది. రాత్రి సమయాల్లో చలిగాలుల తీవ్రత అధికమవుతోంది. తెల్లవారుజాము పొగమంచు కమ్ముకుంటోంది. వాతావరణంలో భిన్న మార్పులు కారణంగా ప్రజలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. పెరిగిన విద్యుత్ వినియోగం వారం రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగింది. రెండు నెలలుగా శీతాకాలం కావడంతో ఏసీలు, ఫ్యాన్ల వినియోగం తగ్గింది. అయితే గణనీయంగా ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో ఏసీలు, ఫ్యాన్ల వాడకం పెరుగుతోంది. దీంతో విద్యుత్ వాడకం పెరుగుతోందని విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారు. ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని ఈ పరిస్థితుల్లో ఆరోగ్యంపై శ్రద్ధ ఉంచుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

జాగ్రత్తలు పాటించాలి



వాతావరణ మార్పుల కారణంగా రోగాల బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. రాత్రి చలి, తెల్లవారుజామున మంచు, ఉదయం ఎండ తీవ్రత వల్ల జ్వరాలు, రొంప, దగ్గు వస్తాయి. వీటిలో ఎక్కువ సమయం తిరగకుండా జాగ్రత్తలు పాటించాలి. దేహం ఉష్ణోగ్రత 106 ఫారెన్ హీట్‌కు మించరాదు. దేహంలో నీరు తగ్గి చర్మం పొడిబారిపోవడం, మూత్రం ఎర్రగా ఉండి మంట రావటం వంటి లక్షణాలు ఉన్నప్పుడు తక్షణం సహాయక చర్యలు చేపట్టాలి. జ్వరం తరచూ వస్తూ ఉంటే వైద్యులను సంప్రదించి మెరుగైన వైద్యం చేయించుకోవాలి.
- వి.గౌతమి, వైద్యాధికారి, అంబాజీపేట పీహెచ్‌సీ

రేపటి నుంచి వనువులమ్మ జాతర



మామిడికుదురు: పెదపట్నంలో వేంచేసిన మాతా వనువులమ్మ తల్లి జాతర ఈ నెల 16 నుంచి 18 వరకు మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 16న జాగారం, పూజ పుణాల ఊరేగింపు, డప్పు వాయిద్యాలు, సంగీత విభావరితో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. అర్ధరాత్రి నిప్పుల గుండం ఏర్పాటు చేయనున్నామన్నారు. 17న అమ్మవారికి పెద్దవారు 18న అమ్మవారి తీర్థం, సిరిమొక్కు ఊరేగింపు నిర్వహిస్తారన్నారు.

శైవాగమ పాఠశాల ప్రవేశానికి దరఖాస్తులు

అంబాజీపేట: శ్రీ కంచి కామకోటి పీఠాధిపతుల వారి ఆధ్వర్యంలో ముక్కామలలో శైవాగమ పాఠశాల ప్రవేశానికి మంగళవారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు అంబాజీపేట మండల అర్చక సంఘం సభ్యులు తెలిపారు. కంచి కామకోటి పీఠం నుంచి వచ్చిన మందాని లక్ష్మి వర్యవేక్షణలో దరఖాస్తులు స్వీకరించారు. ఆమె మాట్లాడుతూ శైవాగమ పాఠశాల విశిష్టతను వివరించారు. విద్యార్థులు క్రమశిక్షణతో శైవాగమన్ని అభ్యసించడం వల్ల సమాజానికి ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. అర్హులైన వారు, ఆసక్తి ఉన్నవారు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటలలోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మరింత సమాచారం కోసం మండల అర్చక సంఘం వారిని సంప్రదించాలని తెలిపారు. అర్చకుల కుటుంబంలోని చిన్నారులకు ఈ శైవాగమ పాఠశాల ఉపయోగపడుతుందనే ఉద్దేశంతో ఏర్పాటు చేయనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో సమాఖ్య సభ్యులు వెలవలపల్లి సుబ్రహ్మణ్యశాస్త్రి, వక్కలంక విజయభాస్కర్ (బుజ్జి), యలమంచిలి సుబ్బారావు, పుణ్యాల శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సంక్షేమ పథకాల అమలు జగనన్నకే సాధ్యం

అంబాజీపేట: నవరత్నాల్లో పొందుపరిచిన సంక్షేమ పథకాలన్నింటిని అమలు చేసిన ఘనత సీఎం జగనకే సాధ్యమని జిల్లా పార్టీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు కుసలాల బాబూరావు అన్నారు. మాచవరంలో ఏసుక్రీస్తు ప్రార్థన మందిరంలో అంబాజీపేట మండల యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో సమావేశం మంగళవారం జరిగింది. ఆయన మాట్లాడుతూ పాస్టర్లకు నెలకు రూ.5వేలు చొప్పున గౌరవ వేతనం అందిస్తూ పేదల కుటుంబాల్లో వెలుగులు నింపారన్నారు. అందరికీ ఆదర్శవంతమైన పాలన అందిస్తున్న సీఎం జగన్‌ని అన్ని వర్గాల ప్రజలు ఆదరిస్తున్నారన్నారు. 2024లో వైఎస్సార్ సీపీ తిరిగి అధికారం చేపడుతుందని అందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం బాబూరావును ఘనంగా సత్కరించారు. సమావేశంలో వృత్తిపనుల్లో ఎస్.లాజర్, కార్యదర్శి వి.విలియమ్స్, జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ కార్యదర్శి ధనరాజ్ చికిలే తదితరులు పాల్గొన్నారు.

48 మందికి కంటి పరీక్షలు

పి.గన్నవరం: ముంగండలోని మంత్రవాది ఇందిరాకుమారి స్మారక గ్రామీణ వైద్యాలయంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆస్పత్రి వైద్యులు మొత్తం 48 మందికి కంటి పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వీరిలో 15 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయడానికి నిర్ధారించారు. హోమియో వైద్యులు ఐఐపల్లి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కంటి ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

17న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

పి.గన్నవరం: ఈనెల 17వ తేదీ ఉదయం 10 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ టీఎస్ వెంకటాచార్య తెలిపారు. ఎంపీపీ అంబటి భూలక్ష్మి అధ్యక్షతన జరగనున్న సమావేశంలో ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు తదితరులు పాల్గొంటారని వివరించారు. మండల పరిషత్ సభ్యులు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పీహెచ్‌సీ ఫార్మసిస్ట్ శకుంతల మృతి


శకుంతల (ఫైల్)

సఖినేటిపల్లి: స్థానిక పీహెచ్‌సీలో ఫార్మసిస్ట్‌గా పనిచేస్తున్న రామేశ్వరానికి చెందిన కె.శకుంతల(49)మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆమెకు భర్త శ్రీనివాసరావు(టీచర్), ఒక కుమారుడు ఉన్నారు. ఆమె మృతికి స్థానిక పీహెచ్‌సీ ఉద్యోగులు తీవ్ర సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు సానుభూతి వెల్లడించారు.

గృహ నిర్మాణానికి ఆర్థిక సాయం


పెదపట్లలో త్రిమూర్తులు కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న సర్పంచ్ రాంబాబు

ఆలమూరు: మండలంలోని పెదపళ్లలో నిరుపేద కుటుంబానికి చెందిన గొడితి త్రిమూర్తులు గృహ నిర్మాణానికి రూ.1.30 లక్షల ఆర్థిక సాయం పంపిణీ జరిగింది. ఐదేళ్ల క్రితం త్రిమూర్తులు నివాసం ఉంటున్న పెంకుటిల్లు పూర్తిగా శిథిలమై పడిపోయింది. దీనిపై స్పందించిన పలువురు గ్రామస్తులు పునరావాస నిమిత్తం విరాళాలు సేకరించి గుమ్మిలేరు గ్రామ సర్పంచ్ గుణ్ణం రాంబాబు చేతుల మీదుగా ఆర్థికసాయాన్ని మంగళవారం అందించారు. పీఏసీఎస్ అధ్యక్షుడు నెక్కంటి వెంకట్రాయుడు, అల్లూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దేవస్థానానికి కుర్చీల బహూకరణ

సఖినేటిపల్లి: అంతర్వేది దేవస్థానానికి భీమవరం మండలం వెంప్రకు చెందిన తోలేటి సుబ్బారావు, కుటుంబ సభ్యులు కలిసి 50 ప్లాస్టిక్ కుర్చీలను బహూకరించారు. ఈ మేరకు వీటిని ఆలయంలో అసిస్టెంట్ కమిషనర్ సత్యనారాయణకు అందజేశారు. స్వామివారి ప్రసాదాన్ని దాతకు ఇచ్చారు. ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసర కిట్ల పంపిణీ


మెర్లకొడపలో పేదలకు కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, మాధవవర్మ

సఖినేటిపల్లి: జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఐఆర్‌సీఎస్ జీవితకాల సభ్యుల సహకారంతో అంతర్వేదిపాలెం శివారు మెర్లకొడపలో 65 మంది పేదలకు నిత్యావసరాల కిట్లను మంగళవారం పంపిణీ చేశారు. వీటిని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, ప్రముఖ కాంట్రాక్టర్ అల్లూరు మాధవవర్మ చేతుల మీదుగా అందజేశారు.

గోఖలే కాంస్య విగ్రహం రూపకల్పన

- కొత్తపేట వుడయార్ శిల్పశాలల్లో..
- నమూనా విగ్రహం పరిశీలించిన ఎమ్మెల్సీ కుడుపూడి


కొత్తపేటలో గోఖలే విగ్రహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

కొత్తపేట: ఐపీఎస్, డీజీపీగా పనిచేసిన కుడుపూడి గోపాలకృష్ణ గోఖలే కాంస్య విగ్రహాన్ని అమలాపురంలో నెలకొల్పనున్నారు. ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు తండ్రి అయిన గోపాలకృష్ణ గోఖలే కాంస్య విగ్రహాన్ని అమలాపురం టౌన్ శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో నెలకొల్పనున్నారు. ఆ విగ్రహాన్ని రూపొందించే బాధ్యతను కొత్తపేటలో అంతర్జాతీయ శిల్పి డి.రాజకుమార్‌వుడయార్‌కు అప్పగించారు. ఆ మేరకు పోలీసు అధికారి రూపంలో గోఖలే నమూనా విగ్రహాన్ని ఇప్పటికే రూపొందించగా మంగళవారం ఎమ్మెల్సీ కుడుపూడి ఆ విగ్రహాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సూర్యనారాయణరావు మాట్లాడుతూ ఈ విగ్రహాన్ని చూస్తుంటే అప్పటి యంగ్ ఏజ్‌లో పోలీసు అధికారిగా ఆయన మన కళ్ల ముందున్న భ్రాంతి కలుగుతుందన్నారు. జీవకళ ఉట్టిపడేలా విగ్రహాన్ని మలిచిన రాజకుమార్ శిల్పకళా నైపుణ్యాన్ని అభినందించారు. ఆయన వెంట అమలాపురం కౌన్సిలర్, పార్టీ పట్టణ అధ్యక్షుడు సంసాని వెంకటరమణబాబ్జీ, జిల్లా పార్టీ బీసీ విభాగం అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పరిపాలన


కొత్తపేటలో సీసీ డ్రైన్ పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ గంగాధరరావు

కొత్తపేట: ప్రజల ఆర్థిక అవసరాలు తీరేలా వారికి సంక్షేమ పథకాలు అమలు చేస్తూ మరోవక్క రోడ్లు, డ్రైన్లు, వివిధ ప్రాజెక్టుల నిర్మాణంతో ఆదర్శ రాష్ట్రమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ముందుకు వెళుతుందని ఎంపీపీ మార్గన గంగాధరరావు అన్నారు. మంగళవారం స్థానిక గోపాలపురంలో మండల పరిషత్ నిధులు రూ.6 లక్షలతో నిర్మించే సీసీ డ్రైన్ నిర్మాణానికి ఎంపీపీ మార్గన కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి పథకాలు దేశ వ్యాప్తంగా ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయన్నారు. ప్రజలకిచ్చిన మాట, హామీలకు అనుగుణంగా నవరత్నాలు, అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తూ ప్రజల ఆర్థికావసరాలు తీరుస్తున్నారన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ ముత్యాల వీరభద్రరావు, జిల్లా సాంస్కృతిక విభాగం చైర్మన్ సత్తిరాజు ఉషారాణి, ఎంపీటీసీ సభ్యురాలు రేవాడి నాగలక్ష్మి, మండల సేవాదళ్ కన్వీనర్ గూడపాటి ప్రదీప్‌కుమార్, పంచాయతీ సభ్యులు పిల్లి అనంతలక్ష్మి, బొక్కా లోకేష్, పార్టీ బీసీ విభాగం సభ్యుడు రాయుడు శేఖర్, ఎంపీడీఓ ఈ.మహేశ్వరరావు, పంచాయతీ సెక్రటరీ వీవీ రామన్ తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై వైద్య పరీక్షలు

మలికిపురం: మలికిపురం సాయి సంజీవని ఆసుపత్రిలో మంగళవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ప్రముఖ సామాజిక వేత్త అల్లూరు మాధవ వర్మ శిబిరం ప్రారంభించారు. ఈ శిబిరంలో ఆయన మాట్లాడుతూ స్థానిక ప్రజలకు రాయితీపై వైద్య సేవలు అందిస్తున్న సంస్థ, వాకర్స్ సొసైటీ చైర్మన్ రుద్రరాజు నాని సేవలను ఆయన అభినందించారు. ఎండీలు వెంగలరావు, చిలువూరి పవన్‌కుమార్, ఆర్థోపెడిక్ వైద్యులు రుద్రరాజు సాయిశిల్ప తదితరులు వైద్య సేవలు అందించారు. సుమారు 1500 మందికి పైగా ఉచిత సేవలతో పాటు, రాయితీపై వైద్యపరీక్షలు నిర్వహించారు. నాయకులు కేవీఎస్ఎన్ రాజు, ఎంపీపీలు కేతా శ్రీను, వీరా మల్లిబాబు, సర్పంచ్ గెద్దం రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పంట కాలువలకు నీరు విడుదల చేయండి


కత్తిమండలో అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

మలికిపురం: రాజోలు నియోజకవర్గంలో దాళ్వా వరి చేలకు ఇంకా సాగునీరు అవసరమని మరో వారం పాటు సాగునీరు పూర్తి స్థాయిలో సరఫరా చేయాలని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు ఇరిగేషన్ అధికారులకు సూచించారు. మంగళవారం కత్తిమండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కాలువ శివారు భూముల్లో పంట చేలు ఇంకా ఈనిక, పొట్ట దశలో ఉన్నాయని సూచించారు. శివారు భూములు ఎండిపోతున్నాయని సూచించారు. రాజోలు దీవి పూర్తిగా ఇసుక నేలతో ఉండడం వల్ల రైతులు ఇబ్బంది పడుతున్నారని దీనిని దృష్టిలో ఉంచుకుని తదనుగుణంగా రైతు ప్రయోజనాలు కాపాడాలని సూచించారు. అంతకు ముందు అధికారులు బృందం నియోజకవర్గంలోని శివారు ప్రాంతాల్లో పంట పొలాలను ఇరిగేషన్ అధికారుల బృందం పరిశీలన చేసింది. ఇరిగేషన్ ఎస్ఈ జి.శ్రీనివాసరావు, డీఈఈ కె.వెంకటేశ్వరరావు, ఏఈ రమేష్‌బాబు, మండల వ్యవసాయ మండలి చైర్మన్ నల్లి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి


గెద్దాడలో గృహ సారథులకు కిట్లు అందజేస్తున్న నాయకులు

మామిడికుదురు: గృహసారథులు, వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పనితీరును, సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించాలని జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు కటకం శెట్టి ఆదిత్య, ఎక్స్ బోర్డ్ సభ్యులు ఎండీ షరీఫ్, బీటీ ఇన్‌చార్జి సూరిశెట్టి బాబి అన్నారు. ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు ఆదేశాల మేరకు గెద్దాడలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు బొలిశెట్టి భగవాన్, జేసీఎస్ మండల కన్వీనర్ సిరా మణికుమార్ ఆధ్వర్యంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ సీఎం జగన్ ఇచ్చిన మాటకు కట్టుబడి అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించారన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు క్రియాశీల సభ్యత్వంతో పాటు ఉచిత బీమా సౌకర్యం కల్పించిందన్నారు. జగనన్నే మా నమ్మకం కార్యక్రమాన్ని ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించాలని కోరారు. సమావేశంలో గుబ్బల గీత, గూటం వెంకటేష్, గుబ్బల నాగరాజు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కమ్యూనిటీ టాయిలెట్లు మంజూరు చేయాలి


స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఎండీని కలసిన ఎమ్మెల్యే చిట్టిబాబు

అంబాజీపేట: నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో నిత్యావసరమైన ప్రాంతాల్లో కమ్యూనిటీ టాయిలెట్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు కోరారు. విజయవాడలో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ పి.సంపత్‌కుమార్‌ను మంగళవారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. నియోజకవర్గంలోని అన్ని దేవాలయాలు, ప్రభుత్వ పాఠశాలలు, పి.గన్నవరం, అంబాజీపేట, అయినవిల్లి, మామిడికుదురు మండల కేంద్రాల్లో రద్దీగా ఉండే ప్రాంతాలు, అంబాజీపేట వారపు సంత వద్ద కమ్యూనిటీ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని కోరామన్నారు. టాయిలెట్స్ ఏర్పాటు చేయడం వల్ల ప్రయాణికులు, బాటసారులు ఇబ్బందులను తొలగించవచ్చన్నారు. సంపత్‌కుమార్‌ను కలిసిన వారిలో స్టాలిన్‌బాబు ఉన్నారు.

శ్రీరామనామ సప్తాహం

ఆలమూరు: మండలంలోని సందిపూడిలో రామాలయం వద్ద నిర్వహిస్తున్న తొమ్మిదో శ్రీరామ సప్తాహం వైభవంగా జరుగుతుంది. జిల్లా పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రముఖ భజన బృందాలు భక్తి కీర్తనలను ఆలపించడంతో గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. రాజమహేంద్రవరం నుంచి వచ్చిన మహిళ భక్త భజన కళాకారులు ఆలపించిన సుందరకాండ పద్యాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. మంగళవారం వేకువజామున నిర్వహించిన మేల్కొలుపు సేవలో మెండు నాగశ్రీ రామ్, అన్నపూర్ణ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సంపూర్ణ ఆరోగ్యంతోనే విద్యాభివృద్ధి


మోరి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థినికి మాత్ర మింగిస్తున్న ఆరోగ్య సిబ్బంది


అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ రత్నంరాజు

కొత్తపేట: విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటేనే విద్యాభివృద్ధి సాధ్యమని ఎంపీపీ, వానపల్లి, అవిడి పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీల చైర్మన్ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గూడపాటి రమాదేవి అన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని మంగళవారం స్థానిక ప్రభుత్వ బాలుర, జెడ్పీ బాలికోన్నత పాఠశాలల్లో వారు ప్రారంభించారు. ఆయా పాఠశాలల్లో బాలలకు మధ్యాహ్న భోజనం అనంతరం అల్బెండజోల్-400 ఎంజీ మాత్రలను బాలలకు వేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వీర శ్రీనివాసరావు, ఆయా పీహెచ్‌సీల వైద్యాధికారులు ఎస్ఎస్ హర్ష, ఇందిరాభారతీరాయ్, హెచ్ఎంలు డి.క్రిస్టఫర్, ఇందిరాభారు, ఎంహెచ్ఈఓలు ఎస్.బాబి, బీడీ సత్యనారాయణ, ఎంహెచ్ఓలు నూకరాజు, సీహెచ్ఓ వెంకటేశ్వరరావు, ఎంపీహెచ్ఈఓ కె.వరాహరావు, వాడదద్దురావు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అంబాజీపేట: నులిపురుగుల వలన రక్తహీనత కలుగుతుందని ఎంపీడీఓ ఐ.రత్నంరాజు, హెచ్ఎం వీరహనుమంతరావు అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా అంబాజీపేట, ముక్కామల పీహెచ్‌సీల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో నులిపురుగుల నివారణ మాత్రలను పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.గౌతమి, ఎ.ఐంద్రావతి, జీవీ గీతాంజలిల ఆధ్వర్యంలో మంగళవారం పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ఆపరిశుభ్రమైన పరిసరాల్లో, కలుషితమైన వాతావరణంలో నులిపురుగులు వ్యాపిస్తాయన్నారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, స్థానిక జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు ఆరోగ్య సిబ్బంది నేతృత్వంలో వేయించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సఖినేటిపల్లి: పిల్లల్లో రక్తహీనతకు కారణమయ్యే నులిపురుగుల నిర్మూలనకు ఆరోగ్యశాఖ ఆల్బెండజోల్ 400 ఎంజీ మాత్రలు పంపిణీ చేస్తోందని మండల పర్యవేక్షణ అధికారి డాక్టర్ యూనస్ అన్నారు. మంగళవారం జాతీయ నులిపురుగుల నిర్మూలనలో భాగంగా ఆయన మండల వ్యాప్తంగా వివిధ పాఠశాలల్లో పిల్లలకు టాబ్లెట్లు పంపిణీని ప్రారంభించారు. దీనిలో భాగంగా మోరి ప్రాథమిక పాఠశాలలో దగ్గర ఉండి మాత్రలను పిల్లలతో మింగించి విధానాన్ని పర్యవేక్షించారు. పాఠశాల హెచ్ఎం సీహెచ్ సారిసూర్య రావు, హెల్త్ సూపర్‌వైజర్ పీవీఎన్ స్వామి, ఏఏన్ఎం శ్రీద్దీ, ఆశా కార్యకర్తలు యు.లక్ష్మి పాల్గొన్నారు.

రావులపాలెం: జాతీయ డీ వార్మింగ్ డే పురస్కరించుకుని కొమరాజు పిల్లలు, చిన్నారుల రక్షణకు మంగళవారం నిర్వహించిన ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ విజయవంతమైంది. మండలంలోని పెదపళ్ల, కొప్పెర్ల పీహెచ్‌సీ పరిధిలోనున్న 49 ప్రభుత్వ పాఠశాలలు, ఒక జూనియర్ కళాశాల, 76 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో 13022 మందికి మాత్రల పంపిణీ ప్రారంభించారు. అయితే తొలి రోజు 12096 మందికి మధ్యాహ్న భోజనం తరువాత వైద్యారోగ్య సిబ్బంది చిన్నారులు, విద్యార్థులతో మాత్రలు మింగించారు. దీంతో మండలం లో 92.8 శాతం మేర లక్ష్యం పూర్తి చేసినట్లు కొత్తపేట డివిజన్ అదనపు జిల్లా వైద్యాధికారి ఎం.సుమలత, వైద్యాధికారి పి.భవానీశంకర్ తెలిపారు.

మామిడికుదురు: నులిపురుగుల నివారణ మాత్రల వల్ల రక్తహీనతను అరికట్టడంతో పాటు పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతోందని డీప్తి విద్యా సంస్థల అధినేత డీవీవీ సత్యనారాయణ అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మామిడికుదురు డీప్తి పాఠశాల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను మంగళవారం పంపిణీ చేశారు. హెచ్ఎం ఆర్.స్వామినాయుడు, జి.నారాయణమ్మ, కె.వి.శ్రీనివాస్, కె.శిరీష, కె.దుర్గాదేవి తదితరులు పాల్గొన్నారు.

మలికిపురం: స్థానిక డిగ్రీ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేశారు. పీహెచ్‌సీ సిబ్బంది ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

పి.గన్నవరం: నులిపురుగుల నివారణకు పిల్లలందరికి ఆల్బెండజోల్ మాత్రలు మింగించాలని ఎంపీపీ అంబటి భూలక్ష్మి అన్నారు. ముంగండ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ఎంపీపీ భూలక్ష్మి ప్రారంభించారు.

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం


మామిడికుదురులో ఏర్పాట్లను పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ కనకరాజు

మామిడికుదురు: ఇంటర్ పరీక్షల నిర్వహణకు సర్వం సిద్ధం చేశామని చీఫ్ సూపరింటెండెంట్ ఎస్.కనకరాజు, కేజీవీ ప్రసాద్ మంగళవారం తెలిపారు. బుధవారం నుంచి ప్రారంభమయ్యే ఇంటర్ పరీక్షల నిర్వహణకు మండలంలో రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మామిడికుదురు ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాలలో వీటిని ఏర్పాటు చేశామన్నారు. ఏ-కేంద్రంలో 322 మంది, బి-కేంద్రంలో 311 మంది వెరసి 633 మంది విద్యార్థులు (జనరల్, ఒకేషనల్ విభాగాలు) పరీక్షలు రాసే విధంగా ఏర్పాట్లు చేశామన్నారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు చెందిన మొత్తం 1200 మంది విద్యార్థులు రోజు విడిచి రోజు పరీక్షలు రాస్తారన్నారు. ఉదయం 8.30 గంటలకు పరీక్ష కేంద్రానికి విద్యార్థులు చేరుకోవాలని కనకరాజు, ప్రసాద్ సూచించారు. ఈ పరీక్షల పర్యవేక్షణకు జి.శ్రీనివాసరావు, జె.రాజబాబు డీఓలుగా వ్యవహరిస్తారని చెప్పారు.

అంబాజీపేట: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు గంట ముందుగా పరీక్ష కేంద్రానికి హాజరు కావాలని, నిమిషం ఆలస్యమైనా అనుమతించేది లేదని డిపార్ట్‌మెంటల్ అధికారి జేవీవీ సత్యనారాయణ, చీఫ్ సూపరింటెండెంట్ ఎ.అనిల్‌కుమార్ తెలిపారు. పుల్లేటికుర్రు ఏపీఎస్ జూనియర్ కళాశాలలో 320 మంది పరీక్ష రాయనున్నారన్నారు. అంబాజీపేట ఎస్ఎస్ఎం జూనియర్ కళాశాలలో 240 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవనున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.రాధామణి తెలిపారు.

ఆలమూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 15న ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ పరీక్షల సందర్భంగా పరీక్షా కేంద్రాన్ని మంగళవారం రావులపాలెం సీఐ ఎస్.రజనీకుమార్, ఆలమూరు ఎస్సై ఎస్.శివప్రసాద్, తహసీల్దార్ బీవీ శెట్టి, ఎంఈఓ డి.మురళీ సత్యనారాయణ పరిశీలించారు. ఆలమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రారంభమయ్యే ఇంటర్మీడియట్ పరీక్షల్లో నాలుగు కళాశాలలకు చెందిన విద్యార్థులు హాజరు కానున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్వీ.ప్రసాదరెడ్డి తెలిపారు. ప్రథమ సంవత్సరం 373, ద్వితీయ సంవత్సరం 239 మంది విద్యార్థులు పాల్గొంటారన్నారు.

రావులపాలెం: ఇంటర్మీడియెట్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల చీఫ్ సూపరింటెండెంట్ టి.గంగావతి తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, సత్యసాయి కళాశాల్లో రెండు సెంటర్లలో పరీక్షలు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ 322, ద్వితీయ 266, సత్యసాయిలో ప్రథమ 459, ద్వితీయ 439 మంది పరీక్షలు రాయనున్నట్లు సీఎస్ గంగావతి తెలిపారు.

రోడ్డు దుస్థితిపై నిరసన


మొగలికుదురులో నిరసన తెలుపుతున్న స్థానికులు

మామిడికుదురు: మొగలికుదురులో ఆర్అండ్‌బీ రోడ్డు దెబ్బతినడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారంటూ స్థానికులు మంగళవారం నిరసన తెలిపారు. గ్రామ పంచాయతీ ఎదురుగా రోడ్డు దెబ్బతినిపోయిందని, దీనిని తక్షణం పునర్మించాలంటూ నినాదాలు చేశారు. ఈ నిరసనలో జేవీ సత్యనారాయణ, జె.రామలింగేశ్వరరావు, చింతా నంద, సీహెచ్ రవి, కె.తులసీరావు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

మలికిపురం: మండలంలోని గొల్లపాలెం ఓఎన్జీసీ జీసీఎస్‌కు త్రుటిలో ప్రమాదం తప్పింది. గ్రామంలోని జీసీఎస్‌కు సమీపంలో కొంబత్తుల వెంకటేశ్వర్లు కొబ్బరితోటలో మంగళవారం అగ్నిప్రమాదం సంభవించింది. ఓఎన్జీసీ జీసీఎస్‌కు సమీపాన తోటల్లో ఈ ప్రమాదం సంభవించడంతో స్థానికులు ఆందోళన చెందారు. వెంటనే ఓఎన్జీసీ ఫైర్ సిబ్బంది రంగంలోకి దిగి మంటలను అదుపు చేశారు. మంటలు చెలరేగడానికి కారణాలు తెలియలేదు.

కెనరా బ్యాంకు వార్షికోత్సవం

మలికిపురం: మండలంలోని లక్కవరం కెనరా బ్యాంకు కార్యాలయంలో బ్యాంకు వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక బ్రాంచ్ వ్యవస్థాపకుడు గుబ్బల గోపాలకృష్ణ జ్యోతి ప్రజ్వలన చేశారు. బ్యాంకు ప్రధాన వ్యవస్థాపకుడు సుబ్బారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మేనేజర్ మట్టూరి సంతోష్ మాట్లాడుతూ ఖాతాదారులకు మరిన్ని సేవలు అందుబాటులో ఉంచి తక్కువ వడ్డీలతో వ్యవసాయ రుణాలను అందిస్తున్నట్లు వివరించారు. సిబ్బంది ఆశోక చక్రవర్తి, కళ్యాణ్ రామ్, రాజేష్, సెల్వ కుమార్, సందీప్, సతీష్ రాజు పాల్గొన్నారు.